

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028

ఘనంగా డివి కృష్ణ నాలుగో వర్ధంతి




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 179 పేజీలు - 08 వెల - 05/- శనివారం 27-06-2026


## మంత్రి లోకేశ్ తో సమావేశం...

## ఆసక్తికరమైన అంశాలను వెల్లడించిన టీచర్లు

**సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లిన ఉపాధ్యాయులతో మంత్రి లోకేశ్ సమావేశం**

- రాష్ట్ర విద్యావిధానంలో అమలు చేయాల్సిన మార్పులపై పలు సూచనలు
- ప్రతిభ ఆధారంగా హైస్కూల్ సీట్ల కేటాయింపు విధానాన్ని ప్రస్తావించిన టీచర్లు
- టీచర్ల వృత్తి నైపుణ్యం పెంచేందుకు సింగపూర్‌లో అమలు చేస్తున్న పద్ధతుల వివరణ
- ఉపాధ్యాయుల సూచనల అమలుపై ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేస్తామన్న లోకేశ్





సింగపూర్ విద్యావిధానం అత్యంత క్రమశిక్షణతో, విజ్ఞానదాయకంగా ఉందని, అక్కడి విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా ఎంతో బాధ్యతగా వ్యవహరిస్తున్నారని ఇటీవల సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లివచ్చిన ఉత్తమ ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ యాత్రకు వెళ్లిన 37 మంది ఉపాధ్యాయులు శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింగపూర్‌లో తాము గమనించిన అంశాలను, వాటిని రాష్ట్రంలో అమలు చేసే అవకాశాలను వారు మంత్రికి వివరించారు. సింగపూర్‌లో ఉపాధ్యాయులు ప్రతి వారం సమావేశమై సబ్జెక్టుల వారీగా చర్చించుకోవడం, వారి మధ్య సమన్వయం అద్భుతంగా ఉందని టీచర్లు తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి లోకేశ్, రాష్ట్రంలో విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేందుకే చాగంటి కోటేశ్వరరావు గారు రూపొందించిన పాఠ్యాంశాలను ప్రవేశపెట్టామని గుర్తుచేశారు. తాను చదివిన స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఫైనల్ పరీక్షలకు ఇన్విజిలేటర్లు ఉండరని, 'ఆనర్ కోడ్' అనే స్వీయ క్రమశిక్షణ పాటిస్తారని, అందుకే ఎవరూ కాపీయింగ్ వంటివి చేయరని ఉదహరించారు. 'తల్లికి చెప్పలేని పని చేయొద్దు' అన్న చాగంటి గారి మాటలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని లోకేశ్ అన్నారు.

మిగతా 2లో

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు

- సీఎం సలహాదారుడిగా రామకృష్ణారావు
- మొత్తం 13 మంది ఐఏఎస్‌ల బదిలీ..ఉత్తర్వులు జారీ



హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి(సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ సంజయ్ జాజు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సీఎస్‌గా ఉన్న కె.రామకృష్ణారావు ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన్ను సీఎం సలహాదారుగా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో రామకృష్ణారావు స్థానంలో సంజయ్ జాజు సీఎస్‌గా నియమితులయ్యారు. కేంద్ర సర్వీసులో ఈశాన్య ప్రాంత అభివృద్ధి కార్యదర్శిగా పని చేస్తున్న ఆయన్ను తెలంగాణ రాష్ట్రానికి పంపుతూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం నిర్ణయం తీసుకుంది. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ సబ్ కలెక్టర్‌గా, పశ్చిమగోదావరి కలెక్టర్‌గా, హైదరాబాద్ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా, కమిషనర్‌గా, పౌరసరఫ రాల సంస్థ కమిషనర్‌గా పని చేశారు. 2014 నుంచి కేంద్ర సర్వీసులో ఉన్నారు. మిగతాది 2లో

## సాయికృష్ణ కేసులో కొత్త ట్విస్ట్.. మరో ముగ్గురి కోసం గాలింపు..!

- మృతదేహాన్ని మాయం చేయడంలో సీఐ నాగరాజుకు మరో ముగ్గురి సహకారం
- వారిలో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, సీఐ సన్నిహితుడు ఉన్నట్లు గుర్తింపు
- వాళ్లు అశోక్, జంగం నాని, సురేశ్‌గా సిట్ తేల్చినట్లు సమాచారం
- సీఐ అరెస్ట్ తర్వాత అజ్ఞాతంలోకి నిందితులు


2

ఫోన్లు స్విచ్ఛాఫ్‌లో ఉండడంతో వారిని గుర్తించడంలో సవాళ్లు

సాయికృష్ణ లాకప్ డెత్ కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సాయికృష్ణ మృతదేహాన్ని సీఐ నాగరాజుతో కలిసి ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, మరో వ్యక్తి మాయం చేసినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గుర్తించినట్లు సమాచారం.

## దేశంలో 'ఈజీ కనెక్ట్' ప్రారంభం..

**ఇకపై బయలుదేరే ఎయిర్‌పోర్టులోనే అంతర్జాతీయ ప్రయాణ లాంఛనాలు**

**టైర్-2, టైర్-3 నగరాల నుంచి అంతర్జాతీయ ప్రయాణాలు సులభతరం**

- వారణాసి నుంచి తొలి 'ఈజీ కనెక్ట్' విమాన సర్వీస్ ప్రారంభం
- బయలుదేరే విమానాశ్రయంలోనే ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ పూర్తి
- భారత్‌ను గ్లోబల్ ఏవియేషన్ హబ్‌గా మార్చడమే లక్ష్యమన్న కేంద్రం
- కొత్త విధానంతో భారీగా ఉద్యోగాలు, ఆర్థిక ప్రగతి అంచనా




టైర్-2, టైర్-3 నగరాల నుంచి అంతర్జాతీయ ప్రయాణాలు చేసే వారికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. విదేశాలకు వెళ్లే ప్రయాణికుల కోసం నూతన విధానంలో భాగంగా 'ఈజీ కనెక్ట్' విమాన సేవలను ప్రారంభించింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు శుక్రవారం వారణాసిలోని లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి తొలి సర్వీస్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కొత్త విధానంతో... ఇకపై చిన్న నగరాల నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికులు తాము బయలుదేరే విమానాశ్రయంలోనే చెక్-ఇన్, ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ వంటి లాంఛనాలన్నీ పూర్తి చేసుకోవచ్చు. ఉదాహరణకు, వారణాసిలో అంతర్జాతీయ ప్రయాణం మొదలుపెట్టే వారు అక్కడే అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసి, దేశీయ విమానంలో ఢిల్లీ వంటి ఇంటర్నేషనల్ హబ్ విమానాశ్రయానికి చేరుకుంటారు.

మిగతాది 2లో

## ఆర్ఎస్ ప్రవీణ్ హత్యకు ప్రభుత్వం కుట్ర పన్నుతోంది: శ్రీనివాస్ గౌడ్



- ప్రవీణ్ కుమార్ భద్రతను ప్రభుత్వం కావాలనే తగ్గించిందన్న శ్రీనివాస్ గౌడ్
- భద్రతను తగ్గించాలని ఇంటెలిజెన్స్ నివేదిక ఇచ్చిందా అని ప్రశ్న
- ఆయనకు ఏమైనా జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత అని హెచ్చరిక

బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను హతమార్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందంటూ

## మనవాళ్లు క్రెడిట్ కార్డులు విపరీతంగా వాడేస్తున్నారట!



- మే నెలలో రూ. 2,023 బిలియన్ లక్షల కోట్లకు చేరిన క్రెడిట్ కార్డు వ్యయం
- దేశంలో 12 కోట్ల మైలురాయిని దాటిన మొత్తం క్రెడిట్ కార్డుల సంఖ్య
- ఒక్క మే నెలలోనే సుమారు 10 లక్షల కొత్త కార్డుల జారీ

మిగతాది 2లో

### ఆధార్ నంబర్ కొడితే చాలు..

## అన్ని వివరాలు రావాలి: మంత్రి

**ఆర్టీజీఎస్ సేవలపై మంత్రి నారా లోకేశ్ ఉన్నతస్థాయి సమీక్ష**


2

**ఆధార్ నంబర్‌తోనే అన్ని సర్టిఫికెట్ల డిజిటల్ వెరిఫికేషన్**

**మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన**

**కుల, ఆదాయ ధృవపత్రాల జారీ ప్రక్రియ మరింత సులభతరం**

**డేటా లేక్ ద్వారా ప్రభుత్వ శాఖల సమాచారం అనుసంధానం**

కేవలం ఆధార్ నంబర్ ఎంటర్ చేయగానే, ఒక అభ్యర్థికి సంబంధించిన అన్ని రకాల విద్య, క్రీడా సర్టిఫికెట్లు డిజిటల్‌గా వెరిఫై అయ్యే పారదర్శకమైన, పటిష్ఠమైన వ్యవస్థను తక్షణమే ఏర్పాటు చేయాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. దీనివల్ల ధృవపత్రాల పరిశీలన ప్రక్రియ సులభతరం అవ్వడమే కాకుండా,

## మాటల యుద్ధం!

- రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలే లక్ష్యంగా బీజేపీ విమర్శలు
- 'లాపతా రాహుల్' పేరుతో సామాజిక మాధ్యమాల్లో పోస్టర్లతో క్యాంపెయిన్
- రాహుల్ టూర్ల ఖర్చుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న కమలదళం

2



### ఆసుపత్రిలో ముద్రగడను పరామర్శించిన బొత్స, తోట త్రిమూర్తులు



- కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధ పడుతున్న ముద్రగడ
- హైదరాబాద్ లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైసీపీ నేత
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన బొత్స, తోట త్రిమూర్తులు

మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్ హైటెక్ సిటీలోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం వైద్యుల సత్వర పర్యవేక్షణలో ఆయనకు చికిత్స కొనసాగుతోంది. ఈ వార్త తెలియగానే పలువురు వైసీపీ సీనియర్ నేతలు ఆసుపత్రికి వెళ్లి

మిగతాది 2లో

# రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు

ఆయన 2029 ఫిబ్రవరి వరకు సర్వీసులో



కొనసాగనున్నారు. కాగా రాష్ట్రంలో మొత్తం 13 మంది ఐఏఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. చేనేత హస్తకళల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్‌కు బాధ్యతలు అప్పగించింది. అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించిన ప్రభుత్వం.. దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శిగా ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించింది. జీఏడీ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శిగా అహ్మద్ నదీమ్‌ను నియమించింది. మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఎం ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్ నియమితులయ్యారు. రెవెన్యూ శాఖ (విపత్తు నిర్వహణ) ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జాను, ప్రభుత్వ (మైన్స్ అండ్ జియాలజీ) కార్యదర్శిగా ఎం.రఘునందన్ రావును, ఇన్వెస్ట్ తెలంగాణ, ఐ అండ్ సి డిపార్ట్ మెంట్ సీఈవోగా బి.అజిత్ రెడ్డిని నియమించారు. టీజీరెడ్కో వీసీ అండ్ ఎండీగా మహమ్మద్ ముషారఫ్ అలీ పారూఖీ, హ్యాండ్లూమ్స్, టెక్స్ టైల్స్, హ్యాండిక్రాఫ్ట్స్ ప్రత్యేక కార్యదర్శిగా పి.కాత్యాయని దేవి, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా కె.గంగాధర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపల్ కమిషనర్ గా టి.వెంకన్న, టూరిజం డైరెక్టర్ గా కె.విద్యాసాగర్ నియమితులయ్యారు. విద్యాసాగర్ సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ గా అదనపు బాధ్యతలను నిర్వర్తించనున్నారు. కె.చంద్రకళకు హెచ్ ఎండీఏ (కోర్ అర్బన్ రీజియన్, ల్యాండ్ పూలింగ్ అండ్ మెట్రో రైల్) జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ గా ప్రభుత్వం అదనపు బాధ్యతలను అప్పగించింది. రాష్ట్ర అటవీ ప్రధాన సంరక్షణ అధికారిగా వినయ్ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఎంవో ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డిని ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా బదిలీ చేసింది. సీఎంవో ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్‌ను నియమించింది.

# ఆధార్ నంబర్ కొడితే చాలు.. అన్ని వివరాలు రావాలి: మంత్రి

అధికారులను ఆదేశించారు. దీనివల్ల ధృవపత్రాల పరిశీలన ప్రక్రియ సులభతరం అవ్వడమే కాకుండా, రాబోయే వేలాది ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో లక్షలాది మంది అభ్యర్థులకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థి ఆధార్ నంబర్ కొట్టగానే, ఆ సర్టిఫికెట్‌ను ఏ సంస్థ, ఎప్పుడు, ఎవరు జారీ చేశారనే వివరాలు రియల్ టైమ్‌లో తెలిసేలా 'డిజి వెరిఫై' వ్యవస్థను తీర్చిదిద్దాలని సూచించారు. ఇది అధికారుల పనిని 99 శాతం సులభతరం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రి లోకేశ్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ లక్ష్యాలు, ప్రాజెక్టుల పురోగతిని ఆ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల సమాచారాన్ని ఒకేచోట క్రోడీకరించే 'డేటా లేక్' పనులను జులై నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పాఠశాలల్లో డ్రాప్ అవుట్ల సంఖ్యను డేటా లేక్ ద్వారా విశ్లేషించి, వారిని తిరిగి బడికి రప్పించే మార్గాలను అన్వేషించాలని సూచించారు. సంజీవని కార్యక్రమాన్ని కూడా డేటా లేక్‌తో అనుసంధానించాలన్నారు.

**ప్రజా సేవలు మరింత చేరువ కావాలి**

ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా అందించేందుకు 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ వినియోగంపై నెలరోజుల పాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని లోకేష్ ఆదేశించారు. ఈ సేవలను ఎలా వినియోగించుకోవాలి, దానివల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల మంజూరులో ఉన్న అడ్డంకులను తొలగించాలని, రేషన్ కార్డుల విభజన, పేర్ల చేర్పులు, తొలగింపుల ప్రక్రియను మరింత సరళతరం చేయాలని స్పష్టం చేశారు.

**ఎల్‌నినో, విద్యుత్ డిమాండ్‌పై అప్రమత్తత**

రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు జలవనరులు, వ్యవసాయ శాఖలతో పాటు ఇతర విభాగాలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. నీటి వృథాను అరికట్టి, తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. జలాశయాల్లో నీటి లభ్యత, భూగర్భజలాల స్థాయిని ఆర్టీజీఎస్‌లోని 'అవేర్' విభాగం ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, ముఖ్యంగా రాయలసీమలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల జల విద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉన్నందున, విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మనవాళ్లు క్రెడిట్ కార్డులు విపరీతంగా వాడేస్తున్నారట!

దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం మళ్లీ



పుంజుకుంది. ఏప్రిల్ నెలలో స్వల్పంగా నెమ్మదించిన క్రెడిట్ కార్డు వ్యయాలు, మే నెలలో గణనీయంగా పెరిగాయి. 2026 మే నెలలో క్రెడిట్ కార్డుల ద్వారా జరిగిన మొత్తం వ్యయం రూ. 2,023 బిలియన్‌లకు చేరింది. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే ఇది 6.6 శాతం అధికం కాగా, ఏప్రిల్ నెలతో పోలిస్తే 2.6 శాతం వృద్ధి నమోదైంది. ఈ ఏడాది మే నెలలో దేశీయ క్రెడిట్ కార్డుల రంగం ఒక కీలక మైలురాయిని అధిగమించింది. సుమారు 10 లక్షల కొత్త కార్డులు జారీ కావడంతో, మొత్తం కార్డుల సంఖ్య 12.05 కోట్లకు చేరుకుంది. గత 15 నెలల్లో ఇదే అత్యధిక వార్షిక వృద్ధి (8.7 శాతం) కావడం గమనార్హం. లావాదేవీల సంఖ్య కూడా వార్షిక ప్రాతిపదికన 25.8 శాతం వృద్ధితో 587 మిలియన్లకు చేరుకుంది. మరోవైపు, ఒక్కో లావాదేవీపై సగటు వ్యయం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. చిన్న చిన్న మొత్తాల్లో కొనుగోళ్లకు కూడా క్రెడిట్ కార్డుల వాడకం పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.ప్రధాన బ్యాంకుల పనితీరులో మిశ్రమ ఫలితాలు కనిపించాయి. కార్పొరేట్ వినియోగం బలంగా ఉండటంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) కార్డు సగటు వ్యయంలో 12 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేయగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 4.2 శాతం నెలవారీ వృద్ధిని సాధించింది. డిజిటల్ చెల్లింపులు, ఈ-కామర్స్ వ్యాప్తితో క్రెడిట్ కార్డుల మార్కెట్ విస్తరిస్తున్నప్పటికీ, పెరుగుతున్న వడ్డీ రేట్ల నేపథ్యంలో బ్యాంకులు రివార్డు పాయింట్ల విధానంలో తీసుకొస్తున్న మార్పుల ప్రభావం వ్యయాలపై కొంతమేర కనిపిస్తోంది.

# మంత్రి లోకేశ్ తో సమావేశం...
# ఆసక్తికరమైన అంశాలను వెల్లడించిన టీచర్లు

**వివిధ జిల్లాల ఉపాధ్యాయుల సూచనలు**

భీమిలికి చెందిన హెచ్ఎం తిరుమల శ్రీదేవి మాట్లాడుతూ.. సింగపూర్‌లో 'వెల్ నెస్ అంబాసిడర్స్', 'మెంటల్ హెల్త్ కౌన్సిలర్'ల నియామకం ద్వారా





ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచుతున్నారని తెలిపారు. సీనియర్ టీచర్లు జూనియర్లకు మార్గనిర్దేశం చేయడం, పాఠశాల స్థాయిలో 'వెల్ బీయింగ్ కమ్యూనిటీస్', నెలవారీ కాంప్లెక్స్ మీటింగ్‌లు, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ వర్క్‌షాపులు, టీచర్ల విజయాలను వేడుకగా జరపడం వంటివి వారిని ప్రోత్సహిస్తున్నాయని వివరించారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపాల్ జాన్సన్ దేవరాజ్ మాట్లాడుతూ.. సింగపూర్‌లో విద్యార్థులు 'ప్రైమరీ స్కూల్ లెర్నింగ్ ఎగ్జామినేషన్'లో మంచి మార్కులు సాధిస్తేనే 6వ తరగతిలో సమీపంలోని మంచి పాఠశాలలో సీటు లభిస్తుందని చెప్పారు. ఈ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తే ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల స్థాయిలో నాణ్యత పెరుగుతుందని సూచించారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ, విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోగలరా అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. పల్నాడు జిల్లాకు చెందిన హెడ్ మాస్టర్ మోటా పార్వతి మాట్లాడుతూ.. సింగపూర్‌లో 'ఫ్యూచర్ ఫోకస్ ఎడ్యుకేషన్' అమలులో ఉందని, విద్యార్థులు పాఠశాల నుంచి బయటకు వచ్చేసరికి ఏదో ఒక నైపుణ్యంతో వస్తున్నారని, దీనివల్ల ఉపాధి కోసం ఎదురుచూసే పరిస్థితి లేదని అన్నారు. గుంటూరుకు చెందిన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ గుమ్మడి షీలా మాధురి మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడలకు అక్కడ సమ ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన 3 శాతం స్పోర్ట్స్ కోటా క్రీడలకు ప్రోత్సాహకరంగా ఉందని, గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తమను సింగపూర్ పంపి ఉపాధ్యాయుల గౌరవాన్ని పెంచారని మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతపురం జిల్లా పామిడికి చెందిన ఏపీ మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ అరుణ మాట్లాడుతూ.. సింగపూర్‌లో టీచర్లకు ఏటా వంద గంటల ఆన్‌లైన్ శిక్షణ తప్పనిసరి అని, దీనివల్ల ఏఐ వంటి అధునాతన టెక్నాలజీపై వారికి అవగాహన పెరుగుతుందని చెప్పారు. టీచర్లు మూడు నెలల పాటు తమకు ఆసక్తి ఉన్న పరిశ్రమల్లో పనిచేసే అవకాశం కూడా ఉందని, ఇది ఎంతో ఉపయోగకరమని అన్నారు. శ్రీకాళహస్తి మండలానికి చెందిన స్కూల్ అసిస్టెంట్ ఎన్. సుబ్రహ్మణ్య శర్మ, అనంతపురం జిల్లా గుత్తికి చెందిన బండి శ్రీనివాసులు మాట్లాడుతూ.. సింగపూర్‌లోని 'ఫర్ ద టీచర్, బై ద టీచర్' విధానం, మెంటరింగ్ పద్ధతుల వల్ల ఉపాధ్యాయులు ఒత్తిడి లేకుండా బోధన చేయగలుగుతున్నారని తెలిపారు.

**సూచనలపై ప్రత్యేక యంత్రాంగం: మంత్రి లోకేశ్**

ఉపాధ్యాయుల సూచనలను సావధానంగా విన్న మంత్రి లోకేశ్, వారందరూ అద్భుతమైన సలహాలు ఇచ్చారని ప్రశంసించారు. "సింగపూర్ వెళ్లిన ఉపాధ్యాయులు ఇచ్చిన సూచనల అమలుకు ఒక ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసి, సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తాం. అయితే, సంస్కరణలు విద్యార్థి కేంద్రంగా ఉండాలి. సింగపూర్ ఈ స్థాయికి రావడానికి ఐదారు దశాబ్దాలు పట్టింది. మనలో కూడా ఆ కసి, పట్టుదల రావాలి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'లీప్' యాప్‌ను కేవలం 2 శాతం తల్లిదండ్రులే డౌన్‌లోడ్ చేసుకున్నారు. తమ పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకుంటేనే వ్యవస్థలో మార్పు సాధ్యమవుతుంది" అని లోకేశ్ స్పష్టం చేశారు.

# దేశంలో 'ఈజీ కనెక్ట్' ప్రారంభం..
## ఇకపై బయలుదేరే ఎయిర్‌పోర్టులోనే అంతర్జాతీయ ప్రయాణ లాంఛనాలు

ఈ కొత్త విధానంతో... ఇకపై చిన్న నగరాల నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికులు తాము బయలుదేరే విమానాశ్రయంలోనే చెక్-ఇన్, ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ వంటి లాంఛనాలన్నీ పూర్తి చేసుకోవచ్చు. ఉదాహరణకు, వారణాసిలో అంతర్జాతీయ ప్రయాణం మొదలుపెట్టే వారు అక్కడే అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసి, దేశీయ విమానంలో ఢిల్లీ వంటి ఇంటర్నేషనల్ హబ్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఎలాంటి తనిఖీలు లేకుండా నేరుగా అంతర్జాతీయ విమానం ఎక్కవచ్చు. ఈ సందర్భంగా మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. విమాన ప్రయాణాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, భారత విమానయాన రంగాన్ని ప్రపంచంలోనే పోటీపడేలా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. "భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా, స్వయం సమృద్ధి కలిగిన ఏవియేషన్ రంగాన్ని నిర్మించడంలో ఇది ఒక కీలక ముందడుగు" అని ఆయన తెలిపారు. ఈ 'ఈజీ కనెక్ట్' వ్యూహంతో 2030 నాటికి భారత్‌ను ప్రయాణికులకు ప్రాధాన్య ఏవియేషన్ హబ్‌గా, 2047 నాటికి గ్లోబల్ ఏవియేషన్ హబ్‌గా మార్చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధానం వల్ల పర్యాటకం, వాణిజ్యం, పెట్టుబడులు పెరిగి ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. దీని ద్వారా 2030 నాటికి దాదాపు 4 లక్షల ఉద్యోగాలు, 30 బిలియన్ డాలర్ల అదనపు జీడీపీ సమకూరుతుందని అంచనా.

# ఆర్ఎస్ ప్రవీణ్ హత్యకు ప్రభుత్వం కుట్ర పన్నుతోంది: శ్రీనివాస్ గౌడ్

బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను హతమార్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందంటూ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. ప్రవీణ్ కుమార్‌కు ఉన్న భద్రతను కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే తగ్గించిందని ఆందోళన వ్యక్తం చేశారు. "ఆయనకు భద్రతను పూర్తిగా తొలగించాలని లేదా కుదించాలని ఇంటెలిజెన్స్ ఏమైనా నివేదిక ఇచ్చిందా? ఒకవేళ ఇస్తే ఆ నివేదికను ప్రభుత్వం ఎందుకు దాస్తోంది? తక్షణమే పబ్లిక్ డొమైన్ లో పెట్టాలి" అని డిమాండ్ చేశారు. ప్రవీణ్ కుమార్‌కు ఏదైనా జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## సాయికృష్ణ కేసులో కొత్త ట్విస్ట్..
# మరో ముగ్గురి కోసం గాలింపు..!

సీఐ నాగరాజుతో కలిసి ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, మరో వ్యక్తి మాయం చేసినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గుర్తించినట్లు సమాచారం. సీఐ నాగరాజుతో పాటు హెడ్‌కానిస్టేబుళ్లు అశోక్, జంగం నాని, సీఐ సన్నిహితుడు సురేశ్ ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. నాగరాజు అరెస్ట్ అనంతరం వీరంతా అజ్ఞాతంలోకి వెళ్లగా, ప్రస్తుతం వారి కోసం సిట్ అధికారులు గాలింపు చేపట్టారు. వారి మొబైల్ ఫోన్లు కూడా స్విచ్ఛాఫ్‌లో ఉండటంతో ఆచూకీ కనుగొనడం సవాల్‌గా మారింది. ఈ వ్యవహారంలో సీఐ నాగరాజుకు అశోక్ అసిస్టెంట్‌గా వ్యవహరించినట్లు సమాచారం. అలాగే నాగరాజు పేరు చెప్పుకొంటూ ప్రైవేట్ వ్యవహారాలు నిర్వహించడంలో జంగం నాని కీలకంగా ఉన్నట్లు తెలుస్తోంది. పలు అక్రమాల ఆరోపణలు రావడంతో గతంలో అతణ్ని పీఆర్‌కు పంపినట్లు సమాచారం. ఇటీవలే అతడికి కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పోస్టింగ్ లభించింది. మరోవైపు ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని హోంమంత్రి అనిత తెలిపారు. త్వరలోనే అన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆమె స్పష్టం చేశారు.

## ఆసుపత్రిలో ముద్రగడను పరామర్శించిన బొత్స,
# తోట త్రిమూర్తులు

హైదరాబాద్ హైటెక్ సిటీలోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం వైద్యుల సత్వర పర్యవేక్షణలో ఆయనకు చికిత్స కొనసాగుతోంది. ఈ వార్త తెలియగానే పలువురు వైసీపీ సీనియర్ నేతలు ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఈరోజు ఆసుపత్రికి వెళ్లారు. ముద్రగడ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యుల నుంచి వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ముద్రగడ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటం పట్ల వైసీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# మాటల యుద్ధం!

ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తరచూ చేపడుతున్న విదేశీ పర్యటనలను లక్ష్యంగా చేసుకుని బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. ఈ మేరకు 'మిస్సింగ్ రాహుల్ (లాపతా రాహుల్)' పేరుతో సరికొత్త పోస్టర్ ప్రచారాన్ని ప్రారంభించింది. ఆయన పర్యటనల కోసం చేస్తున్న ఖర్చులపై ప్రశ్నలు సంధిస్తూ సామాజిక మాధ్యమాల్లో ఈ క్యాంపెయిన్‌ను ఉద్ధృతం చేసింది. ఈ ప్రచారంలో భాగంగా పలు సినిమా పోస్టర్లను మార్ఫింగ్ చేస్తూ బీజేపీ నేతలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. "ఛడ్ దే ఇండియా", "రాహుల్ ఇన్ పారిస్", "పరదేశ్" వంటి పేర్లతో వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ప్రతిపక్ష నాయకుడి హోదాను 'పర్యటనల నేత'గా మార్చాలని కొందరు బీజేపీ అధికార ప్రతినిధులు ఎద్దేవా చేశారు. ఢిల్లీ బీజేపీ యూనిట్ "స్వదేశ్ వర్సెస్ పరదేశ్" పేరుతో పోస్టర్ విడుదల చేయగా, గోవా బీజేపీ రాహుల్ గాంధీ థాయ్‌లాండ్‌లో విహారయాత్ర చేస్తున్నారా? అంటూ ప్రశ్నించింది. బీజేపీ నేతలు షెహజాద్ పూనావాలా, ఆర్పీ సింగ్ వంటి వారు రాహుల్ పర్యటనల ఖర్చు, పారదర్శకతపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్ గాంధీ ఇప్పటివరకు సుమారు 55 సార్లు విదేశీ పర్యటనలు చేశారని, వీటికి దాదాపు రూ.60 కోట్లకు పైగా ఖర్చయి ఉండవచ్చని వారు అంచనా వేశారు. ఆయన వెల్లడించిన ఆదాయానికి, ఈ పర్యటనల ఖర్చులకు ఏమాత్రం పొంతన లేదని, ఈ పర్యటనలకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయో బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేశారు. అయితే, బీజేపీ చేస్తున్న విమర్శలను కాంగ్రెస్ పార్టీ అంతే ధీటుగా తిప్పికొట్టింది. రాహుల్ గాంధీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నాయకుడని, ప్రపంచవ్యాప్తంగా ఆయనకు ఆహ్వానాలు అందుతుంటాయని పేర్కొంది. ఇవన్నీ కేవలం రాజకీయ ప్రేరేపిత ఆరోపణలనని కొట్టిపారేసింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్ ఈ విషయంపై స్పందిస్తూ, "రాహుల్ గాంధీ కేవలం మన దేశ నాయకుడే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ఆయన్ను గొప్ప నాయకుడిగా భావిస్తారు. అందుకే వివిధ దేశాలు, అంతర్జాతీయ సంస్థల నుంచి ఆయనకు నిరంతరం ఆహ్వానాలు వస్తుంటాయి" అని స్పష్టం చేశారు.

## మహిళా కానిస్టేబుల్ నిర్వాకం.. ఎదురుగా ఉన్నది పెద్దాయన అని తెలిసీ..

ఇంటర్నెట్ డెస్క్: ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఒక వృద్ధుడి విషయంలో నిర్లక్ష్యంగా, అమర్యాదగా వ్యవహరించిన కానిస్టేబుల్‌పై తాజాగా సస్పెన్షన్ వేటు పడింది. రాజస్థాన్‌లోని దుంగర్‌పూర్ జిల్లాలో ఈ ఘటన వెలుగు చూసింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఇటీవల స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు ఒక వృద్ధుడు వెళ్లారు. అయితే, ఆయన ఫిర్యాదు తీసుకునే విషయంలో ఆ కానిస్టేబుల్ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు తెలిసింది. ఎదురుగా ఉన్న టేబుల్‌పై కాళ్లు పెట్టుకుని కానిస్టేబుల్ కూర్చున్న ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎదురుగా పెద్దాయన కూర్చున్నప్పటికీ పట్టించుకోకుండా అమర్యాదకరంగా ఆమె వ్యవహరించినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. వృద్ధుడు స్టేషన్‌లో ఉన్న సమయంలోనే ఎవరో ఫొటో తీసి నెట్టింట పెట్టినట్టు తెలుస్తోంది. ఈ ఉదంతంపై విమర్శలు వెల్లువెత్తడంతో రాజస్థాన్ పోలీసులు స్పందించారు. విషయం తమ దృష్టికి రాగానే మహిళా కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశామని చెప్పారు. కానిస్టేబుల్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని

## ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అన్న ప్రసాద వితరణ





నంద్యాల ప్రతినిధి. జూన్ 26 . (పల్లె వెలుగు ):నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో శుక్రవారం అన్నప్రసాద వితరణ చేసినట్లు లయన్ పెసల శ్రీకాంత్ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సమన్వయకర్త తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 9 సంవత్సరాలుగా నంద్యాల ప్రభుత్వా సర్వజన ఆసుపత్రిలో వచ్చు పేషెంట్ల సహాయకులకు అన్న ప్రసాద వితరణ ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటలకు మరియు సాయంకాలం ఏడు గంటలకు చేస్తున్నట్లు తెలిపారు. సయ్యద్ అస్మతున్నీసా 5వ వర్ధంతి సందర్భంగా వీరి కుమారులు ఎస్ ఖలీల్ ,ఎస్ కమల్ భాష మరియు ఎస్ ఎం భాష(బాబీ) కుటుంబ సభ్యుల సహకారంతో సుమారు 200 మందికి అన్న ప్రసాద వితరణ నిర్వహించామన్నారు. నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో దూరప్రాంతాల నుంచి వైద్యం కొరకు ఎంతోమంది వస్తుంటారని వారికి ప్రత్యనిత్యం అన్న ప్రసాదం దాతల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు.

# జూన్ 30 వ తేదీన

## నంద్యాల జిల్లా స్థాయి రాపిడ్,బ్లిట్జ్ చెస్ పోటీలు.

**శ్రీ రామకృష్ణ డిగ్రీ కాలేజ్ స్వామి వివేకానంద ఆడిటోరియంలో.**
**రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహించబోయే రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో పాల్గొనే జిల్లా రాపిడ్,బ్లిట్జ్ జట్ల ఎంపిక కోసం నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30 వ తేదీ రామకృష్ణ డిగ్రీ కళాశాల స్వామి వివేకానంద ఆడిటోరియంలో నంద్యాల జిల్లా స్థాయి రాపిడ్ అండ్ బ్లిట్జ్ చెస్ పోటీలు వేరు వేరుగా నిర్వహించడం జరుగుతుందని నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు, ఆంధ్ర చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ డాక్టర్. జి. రవికృష్ణ, జిల్లా చెస్ కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈనెల 29 వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు ఏపీ చెస్ వెబ్ సైట్ లోఎంట్రీలు నమోదు చేసుకోవాలని,నంద్యాల జిల్లా ఎంపికైన క్రీడాకారులు త్వరలో కాకినాడ లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.
ఇతర వివరాలకు సంప్రదించవలసిన నెంబర్ 9010451585.

## మహానంది మండలంలో పెద్ద సరిగెత్తు వేడుకలు





మహానంది, పల్లె వెలుగు మహానంది మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకల్లో భాగంగా శుక్రవారం పెద్దసరిగెత్తును ఘనంగా నిర్వహించారు. మండలంలోని తిమ్మాపురం,గాజులపల్లె, బసాపురం గ్రామాల్లోని చావిళ్లలో పీర్లదేవుళ్లను కొలువుదీర్చారు. కులమతాలకు అతీతంగా ముస్లింలు, హిందువులు పీర్లదేవుళ్లకు మొక్కులను చెల్లించారు. గుండాలవెలిగించి తెల్లవార్లు పీర్లచావిళ్లలో భక్తులు జాగారంచేశారు. అలాగే యువకులు గుండం చుట్టూ చిందులు తొక్కుతూ సంబరాలు జరుపుకున్నారు. తప్పెట్లతో గ్రామ పురవీధులలో ఊరేగించారు. ఐదు రోజుల నుంచి పీర్లను పీర్లచావిడితో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం పీర్లను పుర వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగిస్తూ గ్రామ శివారుల్లో జలధికి తీసుకెళ్లారు. వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అనంతరం పీర్ల ను ఆయా చావిళ్లలో భద్రపరిచారు.

## ఘనంగా ముగిసిన మొహర్రం వేడుకలు..



పాణ్యం జూన్ 26 పల్లె వెలుగు : మండలంలో తొమ్మిది రోజులపాటు జరిగిన మొహర్రం వేడుకలు కులమతాలకు అతీతంగా శుక్రవారం ఘనంగా ముగిశాయి. పాణ్యం పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో పీర్ల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు రంగులు చల్లుకొని సంబరాలు జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో ఎటువంటి సంఘటనలు జరగకుండా సీఐ కిరణ్ కుమార్ రెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మార్కెట్ యార్డు భూమి కేటాయింపు రద్దు చేయాలి..

# ఆర్ ఏ ఆర్ ఎస్ ను పరిరక్షించాలి.

**రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆద్వర్యంలో "సమాజమే దేవాలయం... ప్రజలే దేవుళ్లు" చైతన్య గేయం ఆవిష్కరణ.**




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి రచించి, రూపొందించిన "సమాజమే దేవాలయం... ప్రజలే దేవుళ్లు" సిద్ధాంతమా? లేక కేవలం నినాదమా? ప్రజలే నిర్ణయించాలి... సమాజమే ఆలోచించాలి... అనే సందేశాత్మక గేయాన్ని శుక్రవారం నంద్యాలలోని సమితి ప్రధాన కార్యాలయంలో అఖిలపక్ష ప్రజా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతాంగ సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ పరిశోధన కోసం ఏర్పాటు చేసిన ప్రజాహిత సంస్థలను పరిరక్షించి మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతులకు నిల్వ, మార్కెటింగ్, బ్యాంకింగ్ తదితర సేవలను విస్తరించాల్సిన నూనెపల్లె మార్కెట్ యార్డులోని విలువైన భూమిని రాజకీయ అవసరాలకు కేటాయించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా, రాయలసీమ రైతాంగ అభివృద్ధికి కీలకమైన నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ ఏ ఆర్ ఎస్)లో తాత్కాలిక కలెక్టరేట్ కార్యాలయాన్ని కొనసాగించడం వల్ల వ్యవసాయ పరిశోధనలు, రైతులకు అందాల్సిన సేవలకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు. రైతుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రజా సంస్థల భూములను ఇతర అవసరాలకు వినియోగించడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు.

***"సమాజమే దేవాలయం... ప్రజలే దేవుళ్లు" అనే సిద్ధాంతాన్ని విశ్వసిస్తున్నామని చెప్పే పాలకులు, ప్రజాహిత సంస్థల ఆస్తులను రాజకీయ అవసరాలకు వినియోగించడం నిజంగా సిద్ధాంతమా? లేక కేవలం నినాదమా? అనే ప్రశ్నను ఈ గేయం సమాజం ముందుంచుతోందన్నారు.***

ఈ ఉద్యమం ఏ ఒక్క రాజకీయ పార్టీకి వ్యతిరేకం కాదని, ప్రజా ఆస్తుల పరిరక్షణ, రైతాంగ సంక్షేమం, ప్రజా సంస్థల బలోపేతం కోసం జరుగుతున్న ప్రజాస్వామ్య ఉద్యమమని పేర్కొన్నారు. రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు, అన్ని రాజకీయ పార్టీలు కలిసి ప్రజా ఆస్తులను కాపాడేందుకు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.
నూనెపల్లె మార్కెట్ యార్డులో తెలుగుదేశం పార్టీ కార్యాలయం కోసం కేటాయించిన రెండు ఎకరాల భూమి కేటాయింపును ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని, రైతాంగ ప్రయోజనాలను కాపాడాలని నాయకులు డిమాండ్ చేశారు. అలాగే, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థలం (ఆర్ ఏ ఆర్ ఎస్)లో ఏర్పాటు చేసిన కలెక్టరేట్ కార్యాలయాన్ని ప్రత్యామ్నాయ ప్రాంతానికి తరలించి, వ్యవసాయ పరిశోధన సంస్థను పూర్తిస్థాయిలో పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు యర్రం శంకర్ రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, ప్రముఖ న్యాయవాది శంకరయ్య, ఏపీ రైతు సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి రామచంద్రుడు, సహాయ కార్యదర్శి సురేష్, గాయకుడు నారాయణ గౌడ్, భాస్కర్ రెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు, పట్నం రాముడు, రాఘవేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డివి కృష్ణ నాలుగో వర్ధంతి

కర్నూలు ప్రతినిధి. జూన్ 26 . (పల్లె వెలుగు ):డి వి కృష్ణ నాలుగో వర్ధంతిని కర్నూల్ నగరంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు ఏ అరులప్ప బి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డివి కృష్ణ ఆదర్శ కమ్యూనిస్టు విప్లవోద్యమ నాయకుడు దళితపేటలో




అంబేద్కర్ సంఘాలు బట్టి రెండు గ్లాసుల పద్ధతిని వ్యతిరేకంగా పోరాటం చేశాడు బీడీ కార్మికులను కూలీలను సమ్మె కట్టి కూలి రేట్లు పెంచుకొని ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా పోరాటం చేశాడు ఈ విధంగా నిజాం సుగర్సు రైతాంగ సమస్యల పైన పోరాటం చేసి వారి హక్కుల కోసం పోరాటం చేశారు భూ పోరాటాలు కూలీ పోరాటాలు నిర్మించి గ్రామీణ ప్రాంతాలలో రైతు కూలీ సంఘాలు నిర్మించి హక్కులను సాధించారు నేడు దేశంలో ప్రపంచంలో తీవ్రమైన ఆర్థిక సంక్షేమం తలెత్తుతున్నది. సామ్రాజ్యవాదులు యుద్ధాలను మన నెత్తి మీద రుద్ది బారాలను విధ్వంసాలను మిగులుస్తున్నారు బడా కార్పొరే కంపెనీలకు లాభం చేకూరుస్తున్నారు. మరోవైపు దేశంలో మోడీ 12 ఏళ్ల పాలనలో రాజ్యాంగ మౌలిక వ్యవస్థలన్నీ లోబర్చుకొని మత ప్రతిపాదికన ప్యాసిజానికి రోడ్డు నిర్మించి ముస్లింలని ఇతర మతాలని కాదు విప్లవ కారులను కమ్యూనిస్టులను చివరకు ప్రతిపక్షాలను కూడా ఈ దేశంలో నిర్మూలించే వైఖరి చేపట్టారు. ఒకవైపు దేశంలో ప్రజల హక్కులు అరిస్తున్నాయి. దేశంలో కార్మిక కార్మికులు రైతాంగము నిరుద్యోగులు యువజనులు రైతులు వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి ఎదురవుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో టి యు సి ఐ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి టి తిరుపాలు టి యు సి ఐ ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యుడు రమేష్ సురేషు రామకృష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

## కలుగొట్ల గ్రామంలో ఆర్.సి.యం

# క్రిస్టియన్ అసెంబ్లీ చర్చిల వార్షికోత్సవాల

**● కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్ దేవ సహాయం ● డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన**

ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూన్ 26 తధానంతరం వారు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని దళితుల మధ్య చిచ్చుపెట్టేవారిని వ్యతిరేకించాలని అన్నారు అనంతరం వారు మాట్లాడుతూ నేటికీ అనేక ప్రాంతాలలో అగ్రకుల చర్చిలో దళితుల చర్చిలో వేరువేరుగానే ఉన్నాయంటూనాయి దళితవాడల్లో కూడా మాల మాదిగ చర్చిలు వేరు వేరుగా ఉన్నాయి కానీ పల్లెల్లో దళిత క్రైస్తవుల జీవితాలు కడుదయానీయకంగా ఉన్నాయంటూ కేవలం దళితులు క్రైస్తవ మతంలో విశ్వాసులుగా మాత్రమే మిగిలిపోతున్నారు క్రైస్తవ మతంలో ఆధిపతులుగా నేటికీ అగ్రకులాల వారే చలామణి అవుతున్నారని వాళ్లు రాజకీయ పలుకుబడిని ఉపయోగించి విదేశాల నుండి నిధులు దండుకొని విద్యాసంస్థల వైద్యాలయాలు నెలకొల్పే కోట్లకు అధిపతి అవుతున్నారని వారు సామాజిక భద్రత భావానికి గురికావడం లేదని మతోన్మాదులు దాడులు మరియు హిందుత్వ దాడులకు గురి కావడం లేదని వారు అన్నారు దళితులుగా పుట్టినందుకు తరతరాలుగా ఎదుర్కొంటున్న వివక్ష అనచవేతల నుండి కొంతైనా ఉపశమనం కలుగుతుందని మతం మారుతున్నారు అయితే కులం ఈనాటికి కొనసాగుతూనే ఉందిఅని భారత రాజ్యాంగంలో



ప్రజలు ఎవరు ఏం మతం అయినా స్వీకరించడం విశ్వసించకపోవడం పౌర హక్కు హిందువులుగా ఉన్న దళితుల పట్ల కులవక్ష పాటిస్తూ ఊరికి దూరంగా గుడిలోకి రానికపోవడంతో ఉపశమనం కోసం కుల వివక్ష లేని చర్చలకు వెళుతున్నారని వారు అన్నారు ఇప్పటికైనా సుప్రీంకోర్టు తీర్పు పున సమీక్షించాలని వారు కోరారు లేనిపక్షంలో దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సెక్రెటరీ రాజీవ్, , కెవిపిఎస్ నాయకులు కలుగోట్ల రాజా రమేష్, రంగన్న, సుమాల రాజు, సుమాల అంతోని, ఎస్ తిమ్మన్న,చిన్నప్ప గుడికళ్ ఆనందు, గ్రామ నాయకులు సుమాల ముత్తు రామలింగడు, మోహన్, బేడ బుడగ జంగాల రామరాజు, సుమాల జైపాల్, పాల్గొన్నారు





# ఎస్ఐఆర్' వేగవంతానికి ప్రత్యేక చర్యలు

☛ కర్నూలు ఈఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు

☛ శని, ఆదివారాల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన బుధవారపేట 122, 123, 124, ఖల్లా 192, 193 పోలింగ్ కేంద్రాల పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ప్రజలకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించి, 2002 ఓటరు జాబితాను 2026 జాబితాతో సరిపోల్చి, స్వయంగా ఎన్యూమరేషన్ ఫారాలు పూరించారు. రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల సహకారం తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నప్పుడు వారికి ముందస్తు సమాచారం ఇవ్వాలని ఈఆర్వో, బిఎల్వోలకు సూచించారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఎస్ఐఆర్‌లో ఎన్యూమరేషన్ ఫారాల అందజేత, డిజిటలైజేషన్ ప్రక్రియకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. విద్యావంతులు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల ఉద్యోగులు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వామ్యం కావొచ్చని, తమ వీధిలో ఉన్న ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు పూరింపులో సహకారం అందించాలని కోరారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లకు ఇరుగుపొరుగున ఉన్న వారు సమాచారం అందించాలని, అర్హులైన ప్రతి



ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వామి కావాలని సూచించారు. అదేవిధంగా ఈ శని, ఆదివారాల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌వోలు, సూపర్వైజర్లు అందుబాటులో ఉండి, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేయడం, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియలను చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఈఆర్వో ధనుంజయ, సూపర్వైజర్లు వేణుప్రియ, రసూల్, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: ఎమ్మెల్యే బుడ్డా

మహానంది, పల్లె వెలుగు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా





నాయకులు, క్లస్టర్ ఇన్చార్జిలు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పనిచేయాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సూచించారు. శుక్రవారం మహానంది గ్రామంలోని దేశం పార్టీ కార్యాలయం వద్ద నాయకులు, క్లస్టర్ ఇన్చార్జిలు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం మండలంలో జరుగుతున్న సర్ ప్రోగ్రాం పై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..గ్రామాల్లో కూటమి నాయకులను సమన్వయం చేసుకొని ఫలితాలు సాధించేలా ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాల న్నారు. ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నేతలు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఈర్నపాడులో ఎస్ ఐ ఆర్ ను చేపట్టిన వైయస్సార్ పార్టీ



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 26 : బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్నపాడు గ్రామంలో శుక్రవారం వైఎస్ఆర్ పార్టీకి చెందిన నాయకులు ఎస్ ఐ ఆర్ ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. వైయస్సార్ పార్టీ రైతు విభాగం కార్యదర్శి సిద్ధం మౌలాలి రెడ్డి, గ్రామ అధ్యక్షుడు ఎర్రం గోపాల్ రెడ్డి, గ్రామంలోని 176, 177, 178 బూతులలో పర్యటించారు. ప్రజలందరూ జాగ్రత్తగా తమ ఓటును నమోదు చేయించుకోవాలని సూచించారు. ఓటు హక్కు కు అర్హత కలిగిన వారందరూ కూడా తమ ఓటును నమోదు చేయించుకోవడంలో జాగ్రత్తలు వహించాలని అన్నారు. ఈ విషయంలో జాగ్రత్త వహిస్తే రాబోవు ఎన్నికల్లో ఓటు గల్లంతయ్యే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు.

## రాష్ట్రం లో విద్యారంగ సమస్యలు

# పరిష్కరించేంతవరకు పోరాటం ఆగదు.

**కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడికి వ్యతిరేకంగా పోరాడుదాం .**

**పీ.డీ.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షుడు .రఫీ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ పిలుపు.**




పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల పట్టణంలో పీ.డీ.ఎస్.యు రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు జూన్ 25, 26 తేదీల్లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సమావేశాలకు పీ.డీ.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎం.డి. రఫీ అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభానికి ముందు విద్యార్థి అమరవీరులకు రెండు నిమిషాల మౌనం పాటించి ఘన నివాళులు అర్పించారు.

అనంతరం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో దేశ, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో పెరుగుతున్న ఫీజుల దోపిడీ, కాపిటేషన్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, హాస్టల్, రవాణా తదితర పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులపై మోపుతున్న అదనపు ఆర్థిక భారంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, విద్య హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా రంగంపై ప్రభుత్వం సమర్థవంతమైన నియంత్రణను అమలు చేయడంలో విఫలమవుతోందని, విద్యను వ్యాపారంగా మార్చే ధోరణిని అరికట్టాలని కోరారు. ఫీజుల నియంత్రణకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు, చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను బలోపేతం చేయాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్త ఉద్యమ కార్యాచరణలో భాగంగా జూలై 2న మంగళగిరిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా, జూలై 10 నుంచి 15 మధ్య అన్ని జిల్లాల్లో డీఈఓ, డీవైఈఓ కార్యాలయాల ఎదుట ధర్నాలు, వినతిపత్రాల సమర్పణ, జూలై 19న మంగళగిరిలోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహించాలని రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు, నిరసనలు, వినతిపత్రాల సమర్పణ, చైతన్య కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. విద్య హక్కును కాపాడేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాసంఘాలు ఐక్యంగా పోరాటాల్లో పాల్గొనాలని పీ.డీ.ఎస్.యు పిలుపునిచ్చింది. ఈ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొని పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పీ.డీ.ఎస్.యు పోరాటాలను మరింత ఉధృతం చేస్తుందని రాష్ట్ర కార్యవర్గం స్పష్టం చేసింది.ఈ కార్యక్రమంలో పీ.డీ.ఎస్.యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధు, రాష్ట్ర కోశాధికారి సోమశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం. ధనరాజు, షాహీద్,భాను ప్రసాద్, మావో, , వేణు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల జిల్లా నూతన అడిషనల్ ఎస్పీ అడ్మిన్ గా బాధ్యతలు స్వీకరించిన ఎస్ ఖాదర్ భాషా .



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. సాధారణ బదిలీలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ గా బదిలీ కాబడిన ఎస్ ఖాదర్ బాషా నేడు నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయం నందు బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్ ఖాదర్ భాషా జిల్లా పోలీస్ కార్యాలయంనకు రాగానే జిల్లా సాయుధ బలగాల నుండి గౌరవ వందనం స్వీకరించారు. 2012 బ్యాచ్ కి చెందిన ఖాదర్ భాషా స్వస్థలం అనంతపురం జిల్లా. ఈయన గతంలో నంద్యాల జిల్లాలోని డోన్ సబ్ డివిజన్ డిఎస్పీగా విధులు నిర్వహించారు. రంపచోడవరం, చిత్తూరు, విజయవాడ డిఎస్పీగా సేవలందించారు. అనంతరం అడిషనల్ ఎస్పీగా ప్రమోషన్ పొంది కోనసీమ జిల్లాలో సేవలందించడం జరిగింది. ప్రస్తుతం ఇంటలిజెన్స్ విభాగం నుండి బదిలీపై నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ గా నేడు బాధ్యతలు స్వీకరించడం జరిగింది.

# కన్నుల పండగలా మొహరం వేడుకలు

బండి ఆత్మకూరు పల్లెవెలుగు జూన్ 26: బండి ఆత్మకూరు మండలంలో వేడుకలు శుక్రవారం







కన్నుల పండగలా జరిగాయి. గత మూడు రోజుల నుండి ఆయా గ్రామాలలో కొలువై ఉన్న పీర్లకు ప్రజలు కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం నుండి గ్రామాలలో పీ ర్లను ఊరేగించారు. మండల పరిధిలో ఉన్న ఈర్నపాడు, ఏ కోడూరు కడమల కాలువ, పార్నపల్లి, గ్రామాలలో పీర్ల ఊరేగింపు కార్యక్రమం జరిగింది. డీజేల హోర్లు, డప్పులు, తప్పెట్ల సందళ్లతో ఊరేగింపు కార్యక్రమం జరిగింది. బండి ఆత్మకూరులో ఇమాం ఖాసిం, హుస్సేన్ ఆలం, చందమామ పేర్లు కలిగిన 15 పీర్లను ఊరేగించారు. అంతకుముందు నిప్పుల గుండం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణలు నిర్వహించిన అనంతరం గ్రామంలో ఊరేగింపు సాగింది. కడమల కాల్వ గ్రామంలో పోలీసు పహార మధ్య ఊరేగింపు జరిగింది. గ్రామంలో గత సంవత్సరం పీర్ల పండుగ సందర్భంగా జరిగిన చిన్నపాటి ఘర్షణను దృష్టిలో ఉంచుకొని ఎస్సై జగన్మోహన్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. అంతకు ముందు రోజు రాత్రి ప్రజలందరిని సమైక్యపరిచి గ్రామంలో పీర్ల పండగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని అందరికీ సూచించారు. ఎలాంటి ఘర్షణలు లేకుండా గ్రామంలో మొహరం వేడుకలు ప్రశాంతంగా జరిగాయి. కర్బలా యుద్ధంలో ఇమామ్ హుస్సేన్ ఆయన అనుచరులు సత్యం కోసం ప్రాణాలు అర్పించారు. వారి బలిదానాన్ని ఆశయాలను స్మరిస్తూ భక్తిశ్రద్ధలతో పీర్లను ఊరేగించడం ఆనవాయితీగా జరుగుతూ ఉంది.

## పెద్దమ్మ తల్లి ఆశీస్సులు అందరికీ ఉండాలి






దొర్నిపాడు జూన్ 26 పలివెలుగు న్యూస్ రాష్ట్రంలో ఉన్న రైతులకు ప్రజలఅందరికీ అమ్మలగన్న అమ్మగోవిందిన్నే మూల పెద్దమ్మ తల్లిఆశీస్సులు ఉండాలని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డికోరుకున్నారు శుక్రవారం దొర్నిపాడు మండలంలోని గోవిందిన్నే గ్రామంలో కొలువుదీరిన మూల పెద్దమ్మ తల్లిని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి దర్శించుకున్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు రైతులపై పెద్దమ్మ తల్లి దీవెనలు ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని అమ్మవారిని కోరుకుంటున్నాను అన్నారు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల పై మాట్లాడడంకన్నా రైతుల శ్రేయస్సును గురించి అమ్మవారిని వేడుకున్నారన్నారు వాతావరణ శాఖ అందించిన సమాచారం మేరకు రాష్ట్రంలో వర్షపాతం తక్కువగా ఉన్నందున రైతులు ఆరుతడి పంటలపై మక్కువ చూపాలని ఆయన రైతులను కోరారు, ఓటర్ నమోదు కార్యక్రమం సజావుగా సాగుతుంది అనిఆయనఅన్నారు, ముఖ్యంగా రాజకీయ నాయకులు రైతుల శ్రేయస్సును గ్రామాల అభివృద్ధిని కోరుకోవాలి కానీ కక్షపూరిత రాజకీయాలు చేయకుండా అభివృద్ధిని కోరుకోవాలని అన్నారు,

# వర్షాలు పడాలని గంగమ్మకు పూజలు

కొలిమిగుండ్ల (పల్లె వెలుగు న్యూస్) ప్రతినిధి :- కొలిమిగుండ్ల గ్రామానికి చెందిన ఉపాధి



కూలీలు వర్షాలు పడాలి అని గంగమ్మకు పూజలు నిర్వహించారు. వేసవికాలం ముగిసి న తరుణంలో వర్షాకాలం రావటంతో వర్షం పడుతుంది అనే ఆనందంలో శతకోటి జీవరాసులు వేచి ఉన్నాయి. కానీ వర్షాలు పడక వాగులో వంకలు కుంటలలో ఉన్న నీరు ఇంకిపోయి జీవరాసులకు నీరు దొరకడమే మహాభాగ్యమైన తరుణంలో ఈరోజు కొలిమిగుండ్ల గ్రామంలో ఉపాధి కూలీలు వర్షాలు పడాలి అని చెప్పి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎన్ ఆర్ జి హెచ్ పలువురు ఉపాధి కూలీలు అందరూ పాల్గొనడం జరిగినది.

# శ్రీ కాలబైరవ స్వామిని దర్శించుకున్న

## మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి









ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 26 పల్లె వెలుగు ఆళ్ళగడ్డ మండలం, చిన్న కందుకూరు గ్రామంలో వెలిసిన శ్రీ కాల భైరవ స్వామి వారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి శు క్రవారం నాడు చిన్న కందుకూరు గ్రామానికి చేరుకున్న ఆయనకు వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు గంగుల అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ గంగుల శ్రీ కాలభైరవ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శివరామయ్య స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మాజీ ఎమ్మెల్సీకి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ గంగులకు కుంకుమార్చన ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేసిన ఆలయ అర్చకులు శివరామయ్య ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకులు గంగుల రామిరెడ్డి మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కూలూరు నర్సింహారెడ్డి ,మాజీ కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి ,వైకాపా సీనియర్ నాయకులు సింగం వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## చిన్నారి రిత్వికను చంపిన వారిని కఠినంగా శిక్షించాలి.



ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 26 పల్లె వెలుగు చిన్నారి రిత్వికను చంపిన వారిని కఠినంగా శిక్షించాలని కే రామాచారి విశ్వకర్మ అన్నారు శు క్రవారం నాడు స్థానిక విశ్వరూప నగర్ స్వగృహం నందు పత్రిక ప్రతినిధులతో మాట్లాడుతూ పులివెందల నియోజకవర్గం లింగాల మండలం లోపానుతల గ్రామంలో ఇరుగుపొరుగునా జరిగిన చిన్నపాటి ఘర్షణను మనసులో ఉంచుకొని స్వాతి అనే మహిళ రామాచారి సృజన దంపతుల నాలుగు సంవత్సరముల కుమార్తెను నీటి డ్రమ్ములో ముంచి చంపిన స్వాతి అనే మహిళను కఠినంగా శిక్షించాలని రామాచారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఈ సందర్భంగా రామాచారి విశ్వకర్మ డిమాండ్ చేశారు

# హుజూర్‌నగర్‌లో అంగరంగ

## వైభవంగా మొహరం ముగింపు ఉత్సవాలు

హుజూర్‌నగర్ ॥ జూన్ 26: హుజూర్‌నగర్ పట్టణంలో మొహరం పండుగ ముగింపు రోజైన శుక్రవారం పీర్లచావిడి వద్ద ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ఉదయం నుంచే వేలాది మంది భక్తులు పీర్లను దర్శించుకునేందుకు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకల్లో అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, పత్రికా విలేకరులు, ముజావర్లు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు పీర్లకు మొక్కుబడులు చెల్లించి రాష్ట్రంలో శాంతి, సౌభ్రాతృత్వం, సుభిక్షం నెలకొనాలని ప్రార్థించారు. హిందూ-- ముస్లిం ఐక్యతకు ప్రతీకగా నిలిచిన మొహరం ఉత్సవాలు మత సామరస్యానికి నిదర్శనంగా కొనసాగుతున్నాయని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా న్యూస్ నెట్‌వర్క్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్, రిపోర్టర్ రవి, ముజావర్లు షేక్ సైదా, మోహిన్, నాగుల్ మీరా తదితరులు పాల్గొని పీర్లను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు

# ఓ మనిషి... నీ సంతృప్తియే నీ సంతోషం

పల్లె వెలుగు:మనిషికి కోరికలు అపరిమితం. కోరికలు ఎప్పటికీ ఒకదానితో ఒకటి పోటీ



పడుతూనే ఉంటాయి. ఓ మనిషి! కోరికల వెంట పరుగులు తీయకు. ఇతరులతో పోల్చుకోకు. కోరికలు తీరలేదని కుమిలిపోకు, కుంగిపోకు. ఇతరులతో పోటీ పడుతూ నీ మానసిక ప్రశాంతతను కోల్పోకు. ఆశల వెనుక అంతులేని పరుగు ఆపేయ్. ఆస్తులు, అంతస్తులు పెరిగితే ఆనందం రాదు. డబ్బు, హోదా శాశ్వత సంతోషాన్ని ఇవ్వవు. ఎంత సంపాదించినా ఏదీ నీ వెంట రాదు. సంపదను కూడబెట్టినంత మాత్రాన మనశ్శాంతి లభించదు. ఉన్నదానితో సంతృప్తిగా జీవించడం నేర్చుకుంటే నీకంటే రాజు ఈ లోకంలో మరెవ్వరూ ఉండరు. కోరికలను తగ్గించుకో. మనోనిగ్రహంతో లభించిన దాంట్లోనే ఆనందాన్ని వెతుక్కో. లిలిసంతృప్తి ఒక గొప్ప వరం. అదే జీవితానికి అసలైన బలం.లిలి ఆశల అలజడిని పక్కన పెట్టి, నీ గత జీవితాన్ని ఒక్కసారి పరిశీలించు. నీ వద్ద ఉన్న వాటిలోనే సంతోషాన్ని వెతుక్కో. లేనివాటి కోసం ఆరాటపడకు. ఆర్భాటాల్లో ఆనందాన్ని వెతకకు. ఆత్మానందమే నిజమైన ఆనందం. సంతృప్తి అనే అమృతాన్ని మనసారా ఆస్వాదించు. బాహ్య ప్రపంచంలో లభించే గుర్తింపు తాత్కాలికం. నీ ఆత్మకు తృప్తినిచ్చే ఆనందమే శాశ్వతం. లిలినీ సంతృప్తియే నీ అసలైన సంతోషం. నీ ధైర్యమే నీ బలం. పసిపిల్లల చిరునవ్వులో సంతోషం ఉంది. ప్రకృతిని ఆస్వాదించే చూపుల్లో ఆనందం ఉంది. చిన్న చిన్న పనులు చేయడంలోనే జీవిత మాధుర్యం దాగి ఉంది. నీవు సాధించిన విజయాన్ని ఇతరులతో పంచుకున్నప్పుడే నిజమైన సంతోషం కలుగుతుంది. ఆనందాన్ని ఎండమావుల కోసం వెతకకు. నీ నీడలోనే విశ్రాంతి పొందడం నేర్చుకో. మనుషుల మనసులను గెలుచుకో. మమతల తోటలో సంతోషాన్ని పండించుకో. రేపటి గురించి అధికంగా ఆందోళన చెందకు. గతాన్ని తవ్వుకుంటూ దుఃఖంలో కూరుకుపోకు. ప్రస్తుత క్షణంలో మనసారా జీవించడం నేర్చుకో. నీ ఆత్మకు నచ్చినట్లుగా ఉండు. నీ మనసుకు ఇష్టమైన పనులు చేయి. ఇతరుల ఒత్తిడికి లోనుకావద్దు. నీ సంతృప్తిలోనే అసలైన విజయాన్ని గుర్తించు. చిరునవ్వుతో ప్రతి రోజును ఆహ్వానించు. లిలినీ సంతోషాన్ని నువ్వే గెలుచుకో.సంతోషం అంటే సంతృప్తి, స్వేచ్ఛ, మంచి ఆలోచనలు, ఇష్టమైన పనులు చేసే అవకాశం. వీటి ద్వారా లభించే తృప్తిని మించిన సంతోషం మరొకటి లేదు. చిరునవ్వుతో ప్రతి రోజును గడుపు. లిలినీ సంతోషానికి నీవే కర్త, కర్మ, క్రియలిలి అనే సత్యాన్ని గుర్తించు. జాగ్రత్తగా మసులుకో. మానవత్వంతో జీవించు. మంచిని పెంచు. కరుణ, సహనం, సౌహార్దతతో కూడిన సంతోషాల పూలతోటలో ఆనందంగా ముందుకు సాగిపో. -- నేదునూరి కనకయ్యకాలమిస్ట్, రచయిత, కరీంనగర్

# అమరావతి లో జరిగే రైతుల ధర్నాను జయప్రదం చేయండి

కొలిమిగుండ్ల( పల్లె వెలుగు న్యూస్) ప్రతినిధి :-



అవుకులో సిపిఐ కార్యదర్శి నాగాంజనేయులు, అవుకు ఇంచార్జ్ సంజీవులు మాట్లాడుతూ ఈనెల జూన్ 30వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ వద్దకు వేలాదిగా రైతులు మరియు కవులు రైతులు తరలివచ్చి ధర్నా చౌక్ లో జరిగే మహాధర్నాలో రైతులు అంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరపున విజ్ఞప్తి చేస్తున్నాము ఇప్పటికైనా రైతులంతా మేల్కొని ప్రశ్నించకపోతే రైతులు కనీసం ఒక్క ఎకరం కూడా పండించడానికి కూడా ఎరువులు తెచ్చుకోలేని పరిస్థితి ఇప్పటి పాలక ప్రభుత్వాలు కల్పిస్తా ఉన్నాయి కాబట్టి మీ హక్కులకై పోరాడి పాలకుల కళ్ళు తెరిపించడానికి మన హక్కులను,సాధించుకోవడానికి జూన్ 30న చలో విజయవాడ కార్యక్రమానికి వేలాదిగా రైతులు తరలివచ్చి విజయవంతం చేయండి డిమాండ్స్ రైతులకు తక్షణమే రెండు లక్షల రూపాయల రుణమాఫీ ప్రకటించాలి పండిన పంటలకు మద్దతు ధర ప్రకటించాలి సాగు ఖర్చులు తగ్గేందుకు పెట్రోల్ డీజిల్ వ్యవసాయ యంత్ర పరికరాల ధరలు తగ్గించాలి కవులు రైతులకు ఎలాంటి హామీ లేకుండా ఆర్బిఐ నిబంధనల ప్రకారం రెండు లక్షల రూపాయల వరకు పంట రుణాలు మంజూరు చేయాలి మొక్కజొన్న రైతులకు రైతుల దగ్గర పంట ఉన్నప్పుడే పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర ప్రకారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టి సాగునీటి సౌకర్యాలు మెరుగుపరచాలి ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి ఏడు లక్షలు ఎక్స్గ్రేషియా తక్షణమే ప్రకటించి చెల్లించాలి ఇట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సిపిఐ ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు సంజీవులు అలాగే అవుకు మండల సిపిఐ నాయకులు నాగాంజనేయులు అందే రమేష్ రజాక్ భాష బండి వెంకటేశ్వర్లు రైతు సంఘం నాయకులు మద్దిలేటి నాగేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశలోనే డ్రగ్స్ అలవాట్లకు దూరంగా ఉండాలి..

**☛విద్యార్థి భవిష్యత్తు మత్తులో కాదు... లక్ష్యంపై ఉండాలి..**

**☛మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించిన...నంద్యాల సబ్ డివిజన్ అడిషనల్ ఎస్పీ కుమారి ఎం జావళి ఐపీఎస్.**




పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలలో మాదకద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు నంద్యాల పట్టణ కేంద్రంలో గల శ్రీనివాస్ రామకృష్ణ డిగ్రీ ఉ పీజీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి ప్రమాదకరమైన మత్తుపదార్థాలను యువత ఎట్టి



పరిస్థితుల్లోనూ ముట్టకూడదని, వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. కాలేజీ విద్యార్థుల్లో డ్రగ్స్ అలవాటు ఎలా మొదలవుతుందో వివరిస్తూ, "కేవలం ఒకసారి ట్రై చేస్తే తప్పేముంది? ఒక్కసారికి ఏమవుతుంది?" అనే చిన్న ఆలోచన తో ఈ వ్యసనం రూపుదాల్చుతుందని వ్యక్తం చేశారు. దురదృష్టవశాత్తూ, అలా ఒక్కసారి సరదాగా ప్రారంభించిన వారిలో అత్యధికులు ఆ తర్వాత ఆ అలవాటును వదులుకోలేరని, తమకు తెలియకుండానే దానికి బానిసలుగా మారిపోతారని తెలిపారు. స్నేహితుల ఒత్తిడి కారణంగా కూడా చాలా మంది యువతీ యువకులు ఆల్కహాల్, సిగరెట్లు, గంజాయి వంటి చెడు అలవాట్ల వైపు ఆకర్షితులవుతున్నారని, అటువంటి సమయాల్లో విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ, దృఢమైన నిర్ణయాలతో వాటిని తిరస్కరించాలని, విద్యార్థి భవిష్యత్తు మత్తులో కాకుండా మనం ఎంచుకునే లక్ష్యం వైపు ఉండి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఏఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, ఎన్ఎస్ఎస్ (ఎన్ ఎస్ ఎస్) ప్రతినిధులు, అధ్యాపకులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

**అమీనాబాద్ ఘటనలో బాధ్యులపై బైండోవర్ చర్యలు : రూరల్ ఇన్‌చార్జి సీఐ రామకృష్ణారెడ్డి**

సూర్యాపేట జిల్లా ప్రతినిధి । జూన్ 26, 2026 కోదాడ : శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కోదాడ రూరల్ ఇన్‌చార్జి సీఐ రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. ఇటీవల మండలంలోని అమీనాబాద్ గ్రామంలో జరిగిన ఉద్రిక్త పరిస్థితులకు కారణమైన వ్యక్తులను బైండోవర్ చేసినట్లు ఆయన వెల్లడించారు. ప్రజా న్యూస్ నెట్‌వర్క్ సమాచారం ప్రకారం, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని, ప్రజలు చట్టాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని సీఐ సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన స్పష్టం చేశారు

## తులం బంగారం కాదు.. తులం ఇనుము కూడా ఇవ్వలేదు : కేటీఆర్

।జూన్ 26, 2026 హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, మహిళలకు తులం బంగారం కాదు కదా.. తులం ఇనుము కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. అలాగే డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని చెప్పి అమలు చేయలేదని, ప్రతి పంటకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చినా నెరవేర్చలేదని ఆరోపించారు. ప్రజా న్యూస్ నెట్‌వర్క్ సమాచారం ప్రకారం, రైతుబంధును రూ.15 వేలకు పెంచుతామని చెప్పి రైతులను మోసం చేశారని, విద్యా భరోసా కార్డు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించక విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పడం కంటే ముందు లక్షాధికారులను చేయాలని ప్రభుత్వానికి సూచించారు



# రెండేళ్ల అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి: రాష్ట్ర మంత్రి టీజీ భరత్ పిలుపు

- మౌర్య ఇన్‌లో ఘనంగా కర్నూలు నియోజకవర్గ కూటమి విజయోత్సవ సభ
- రూ.7,000 కోట్లతో రిలయన్స్ ప్లాంట్, త్వరలోనే ఫుడ్ పార్క్, స్టీల్ ప్లాంట్ విస్తరణ
- సి క్యాంప్‌లో హైకోర్టు బెంచ్, నూతన కలెక్టరేట్ భవన నిర్మాణం ఖాయం



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండేళ్ల కాలంలో కర్నూలు నియోజకవర్గ పరిధిలో ఊహించని విధంగా అభివృద్ధి పనులు చేపట్టామని, ఈ విషయాన్ని నాయకులు, కార్యకర్తలు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా పిలుపునిచ్చారు. కూటమి పాలన రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మౌర్య ఇన్‌లోని మంత్రి కార్యాలయంలో కర్నూలు నియోజకవర్గ విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ, కర్నూలు నియోజకవర్గంలోని 33 వార్డుల్లో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. అయితే, ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతున్నప్పటికీ, దానిని ప్రజల్లోకి ఆశించిన స్థాయిలో తీసుకెళ్లడంలో నాయకులు, కార్యకర్తలు వైఫల్యం చెందుతున్నారని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకనైనా క్షేత్రస్థాయికి వెళ్లి, చేసిన మంచి పనులను ప్రజలకు వివరించాలని సూచించారు.

**ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి**

*ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు అబద్ధాలతో ముందు వరుసలో ఉంటారని మంత్రి విమర్శించారు. వారి సోషల్ మీడియా, క్షేత్రస్థాయి దుష్ప్రచారాన్ని కూటమి నాయకులు ఎప్పటికప్పుడు ఖండించి, ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో భారీగా పెన్షన్లు అందిస్తున్నామని, ఈ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అలాగే ఎస్ఐఆర్ (ూ×=) విషయంలో నాయకులందరూ అలర్ట్‌గా ఉండాలని, దొంగ ఓట్ల తొలగింపు ప్రక్రియపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించి కష్టపడాలని స్పష్టం చేశారు.*



కర్నూలుకు భారీగా పెట్టుబడులు.. పారిశ్రామిక ప్రగతి గతంలో ఎన్నడూ లేనివిధంగా కర్నూలు జిల్లాకు భారీగా పెట్టుబడులు తీసుకొస్తున్నట్లు మంత్రి టీజీ భరత్ వెల్లడించారు. ఇప్పటికే రిలయన్స్ సంస్థ రూ. 7,000 కోట్లతో ప్లాంట్ పనులను చేపట్టిందని తెలిపారు. త్వరలోనే జిల్లాలో మరో భారీ ఫుడ్ పార్క్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే నగరంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటయిందని, భవిష్యత్తులో ఈ ప్లాంట్‌ను మరింత విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. కర్నూలులోని సి క్యాంప్ ప్రభుత్వ క్వార్టర్స్ ప్రాంగణంలో హైకోర్టు బెంచ్ తప్పకుండా ఏర్పాటు చేస్తామని, దీంతో పాటు నూతన కలెక్టరేట్ భవనాన్ని కూడా నిర్మిస్తామని మంత్రి స్పష్టం చేశారు. హాజరైన ముఖ్య నాయకులు ఈ విజయోత్సవ సభలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, బొందిలి కార్పొరేషన్ ఛైర్మన్ విక్రమ్ సింగ్, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గీతా మాధురి, బీజేపీ కర్నూలు నియోజకవర్గ అధ్యక్షుడు సూర్య ప్రకాశ్, జనసేన జిల్లా అధ్యక్షుడు సురేష్, కర్నూలు నియోజకవర్గ ఇంచార్జి అర్షద్, ప్రముఖ నాయకులు పవన్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

---

## ‘మనల్నీ ఎవర్రా ఆపేది!’.. కర్నూలు ఆర్‌డీఓ ‘సందీప్’ ల్యాండ్ దందా?

- హైకోర్టు స్టే ఉన్నా ‘పసుపుల’ భూమికి ల్యాండ్ కన్వర్షన్ గ్రీన్ సిగ్నల్!
- ఎంఆర్‌ఓ నివేదికను తుంగలో తొక్కి.. ‘గార్గేయపురం’ ఫోర్జరీ పాస్‌బుక్ కేసుకు క్లియరెన్స్!
- ప్రైవేట్ వ్యక్తులతో రెవెన్యూ ‘దందా’.. ప్రశ్నిస్తే బాధితులపై బెదిరింపులు, అక్రమ కేసులు!
- ఉద్యోగులపై తీవ్ర మానసిక వేధింపులు.. అటెండర్ మృతికి ఆర్‌డీఓ ఒత్తిళ్లే కారణమా?
- విజిలెన్స్, సిసిఎల్‌ఏ (జజూూ) విచారణకు బాధితుల డిమాండ్!




పల్లె వెలుగు కర్నూలు బ్యూరో. “చట్టాలు మా చుట్టాలు.. కోర్టు ఆర్డర్లు మాకొద్దు.. నడిచిందే నా ఇష్టం.. ఇచ్చిందే ఆర్డర్!” అన్న చందంగా తయారైంది కర్నూలు రెవెన్యూ డివిజన్ తీరు. హైకోర్టు ఆదేశాలు ఉన్నా, తహసీల్దార్ల అధికారిక నివేదికలు తప్పుబడుతున్నా.. వాటన్నింటినీ తుంగలో తొక్కుతూ కర్నూలు ఆర్‌డీఓ కె.సందీప్ కుమార్ వివాదాస్పద నిర్ణయాలతో ల్యాండ్ దందాకు తెరలేపారనే తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్ఓఆర్ (ూ=) అప్పీళ్లు, ల్యాండ్ కన్వర్షన్లు, భూసేకరణ ఫైళ్లలో ఆర్‌డీఓ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు ఇప్పుడు కర్నూలు జిల్లాలో పెను సంచలనంగా మారాయి.

కోర్టు ‘స్టే’ ఉన్నా.. నాలుగు రోజులకే కన్వర్షన్ ఎలా? పసుపుల గ్రామంలోని సర్వే నెం. 332/ూ1డీ1 లో ఉన్న 0.93 ఎకరాల భూమి వ్యవహారం ఆర్‌డీఓ అక్రమాలకు అద్దం పడుతోంది. ఈ భూమిపై హైకోర్టులో డబ్ల్యూపీ నెం.19458/2024 దాఖలై ఉండగా, 04-09-2024న కోర్టు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. కానీ, ఆర్‌డీఓ మాత్రం కోర్టు ఆర్డర్లను లైట్ తీసుకున్నారు. ‘చేతులు మారితే ఫైల్ కదులుతుంది’ అనే రీతిలో, దరఖాస్తు చేసుకున్న కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే (=ఓ.ూజ/1926/9/2025, తేదీ: 16-09-2025 ద్వారా) ల్యాండ్ కన్వర్షన్‌కు అనుమతులు మంజూరు చేసేశారు. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించినందుకు బాధితులు ఇప్పటికే ఆర్‌డీఓకు లీగల్ నోటీసులు జారీ చేయడమే కాకుండా, కోర్టు ధిక్కరణ (జశీఙవఎజ్ శీట జశీబతీ) చర్యలకు సిద్ధమవుతున్నారు.

ఫోర్జరీ పుస్తకానికే ‘జై’.. తహసీల్దార్ నివేదిక బూడిదలో పోసిన పన్నీరేనా? మరో సంచలనాత్మక కేసు.. గార్గేయపురం గ్రామం, సర్వే నెం. 619/3 (ర్యా.చీశీ.711) ఆర్ఓఆర్ అప్పీల్. సదరు భూమికి సంబంధించిన పట్టాదార్ పాస్‌బుక్, రెవెన్యూ ఎంట్రీలు పూర్తిగా బోగస్, ఫోర్జరీ అని మండల తహసీల్దార్ (వీ=ూ) సాక్ష్యాధారాలతో నివేదిక ఇచ్చారు. కనీసం పాస్‌బుక్ ఫోర్జరీ అయితే ‘1దీ రిజిస్టర్’ లో ఎంట్రీ ఉండదనే కనీస అవగాహన కూడా లేకుండా, ఆ నివేదికను పక్కనబెట్టి ఆర్‌డీఓ తనకిష్టమొచ్చినట్లు ఆర్డర్ ఇచ్చేశారని బాధితులు మండిపడుతున్నారు. ఫ్రాడ్‌కు సంబంధించిన ఈ ఆర్ఓఆర్ కేసును పూర్తిగా డైవర్ట్ చేసి, అక్రమార్కులకు కొమ్ముకాసేలా ఉత్తర్వులు ఇవ్వడంపై బాధితులు జాయింట్ కలెక్టర్ ఎదుట అప్పీల్‌కు వెళ్లారు.

**ప్రైవేట్ సైన్యం.. అక్రమ వసూళ్ల దందా!**

కార్యాలయంలో ప్రభుత్వ సిబ్బందిని కాదని, ప్రైవేట్ వ్యక్తులకు అధికారిక విధులను అప్పగించడం, వారికి డిప్యూటేషన్ ఆర్డర్లు ఇవ్వడం వెనుక పెద్ద ‘దందా’ నడుస్తోందని నగర ప్రజలు వాపోతున్నారు. ఆర్ఓఆర్ అప్పీళ్లను నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతూ, ‘డిమాండ్లు’ నెరవేరిన వెంటనే రాత్రికి రాత్రే ఫైళ్లు క్లియర్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాలను ఎవరైనా ప్రశ్నిస్తే.. తన అధికార బలంతో బాధితులను బెదిరించడం, వారిపై అక్రమ కేసులు బనాయించడం ఆర్‌డీఓకు పరిపాటిగా మారింది.

**బూతుల పురాణం.. అటెండర్ ప్రాణం బలి!**

ఆర్‌డీఓ సందీప్ కుమార్ కేవలం భూ అక్రమాలకే పరిమితం కాలేదు, కార్యాలయ ఉద్యోగులను సైతం తీవ్ర మానసిక హింసకు గురిచేస్తున్నారనే ఆరోపణలు ఉద్యోగ వర్గాల్లో వినబడుతున్నాయి. సిబ్బందిని నానా బూతులు తిడుతూ, తీవ్ర ఒత్తిడికి గురిచేయడం వల్లే మనస్తాపానికి గురై ఆఫీసులోని ఒక అటెండర్ మృతి చెందారనే వార్త రెవెన్యూ వర్గాలను కుదిపేస్తోంది.

**ఉన్నతాధికారుల విచారణకు డిమాండ్..**

కర్నూలు రెవెన్యూ డివిజన్‌లో గత కొంతకాలంగా ఆర్‌డీఓ జారీ చేసిన వివాదాస్పద ఆర్ఓఆర్ ఉత్తర్వులు, ల్యాండ్ కన్వర్షన్ పర్మిషన్లు, భూసేకరణ ఫైళ్లు, మరియు ప్రైవేట్ వ్యక్తుల డిప్యూటేషన్లపై జిల్లా కలెక్టర్, సిసిఎల్ఏ (జజూూ), మరియు విజిలెన్స్ సంస్థలతో నిష్పాక్షికమైన స్వతంత్ర విచారణ జరిపించాలని, బాధితులకు న్యాయం చేయాలని సర్వత్రా డిమాండ్ వ్యక్తమవుతోంది.

---

## పెసరవాయి గ్రామంలో కన్నుల పండగలా మొహరం వేడుకలు..

గడివేముల పల్లెవెలుగు దినపత్రిక మండలం పెసర వాయి గ్రామంలో మొహరం వేడుకలు శుక్రవారం కన్నుల పండగలా జరిగాయి. గత మూడు రోజుల నుండి ఆయా గ్రామాలలో



కొలువై ఉన్న పీర్లకు ప్రజలు కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని అన్నీ, గ్రామాలలో పీర్ల ఊరేగింపు కార్యక్రమం జరిగింది. డీజేల హోర్లు, దప్పులు, తప్పెట్ల సందళ్లతో ఊరేగింపు కార్యక్రమం జరిగింది. ఫ్యాక్షన్ గ్రామం ఘర్షణను దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై నాగార్జున రెడ్డి పోలీస్ బందోబస్తు నిర్వహించారు. మొహరం పండుగ సందర్భంగా గ్రామ ప్రజలతో ప్రజలందరిని సమైక్యపరిచి గ్రామంలో పీర్ల పండగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని అందరికీ సూచించారు. ఎలాంటి ఘర్షణలు లేకుండా గ్రామంలో మొహరం వేడుకలు ప్రశాంతంగా జరిగాయి. కులమతల అతీతంగా జరుపుకునే పండుగ అందరి ఆశయాలను స్మరిస్తూ భక్తిశ్రద్ధలతో పీర్లను ఊరేగించడం ఆనవాయితీగా జరుగుతున్న ఈ పండుగను గ్రామంలోని అన్ని కులాల వారు సమానంగా ఏకభవించి జరుపుకునే పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బైకులు తగలబెట్టిన అనుమానితులను గుర్తించిన రెండవ పట్టణ సీఐ అస్రార్ భాష.

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల పట్టణంలోని స్థానిక ప్రియాంక నగర్ లో గుర్తు తెలియని వ్యక్తులు రెచ్చిపోయి ద్విచక్ర వాహనాలకు అంటూ పెట్టారు. కాలనీలో మంటలు ఎగిసిపడడంతో కాలనీవాసులు భయాందోళన గురయ్యారు. మంటలు ఎగిసిపడడంతో కాలనీవాసులు అగ్నిమాపక సిబ్బందికి తెలియచేశారు. అనంతరం సమాచారం అందుకున్న రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ అస్రార్ భాష సంఘటన స్థలానికి చేరుకొని కాలిపోయిన వాహనాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు సిసి ఫుటేజ్ ల ద్వారా కొందరి కదలికలను ముందు వెనక పరిశీలించి అనుమానితులైన వ్యక్తులను గుర్తుపట్టి వారి ఫోటోలు మీడియా గ్రూపులలో సిఐ విడుదల చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రెండవ పట్టణ సీఐ అస్రార్ భాష తెలిపారు.



---

## మత్తు రహిత సూర్యాపేటే లక్ష్యం : డీఎస్పీ ప్రసన్నకుమార్

సూర్యాపేట జిల్లా ప్రతినిధి । జూన్ 26, 2026 సూర్యాపేట :




సూర్యాపేట జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ-అడిక్షన్ కేంద్రాన్ని సీఐ వెంకట్‌తో కలిసి సందర్శించిన ఆయన అక్కడ చికిత్స పొందుతున్న బాధితులకు పండ్లు, ఇండోర్ గేమ్స్ కిట్లను అందజేసి వారిలో ఆత్మవిశ్వాసం నింపారు. ప్రజా న్యూస్ నెట్‌వర్క్ సమాచారం ప్రకారం, గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణ కోసం పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారని డీఎస్పీ తెలిపారు. మత్తు వ్యసనానికి గురైన వారు డీ-అడిక్షన్ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకుని వ్యసనానికి దూరంగా ఉండి సాధారణ జీవితం గడపాలని ఆయన సూచించారు. మత్తు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

### రాయలసీమలో భక్తిశ్రద్ధలతో

# మొహర్రం వేడుకలు ఘనంగా ముగింపు

**నంద్యాల జిల్లా వ్యాప్తంగా పీర్ల ఊరేగింపులు.. కులమతాలకు అతీతంగా పాల్గొన్న భక్తజనం.. భారీ పోలీసు బందోబస్తు**




బనగానపల్లె -- షియా ముస్లింల మాతం, షహదత్ ఊరేగింపు




పాణ్యం మండలం -- రంగులు చల్లుకుంటూ మొహర్రం సంబరాలు




బండి ఆత్మకూరు మండలం -- పీర్ల ఊరేగింపులు, నిప్పుల గుండం




చాగలమర్రి మండలం -- లాల్ స్వామి పీర్ల ఊరేగింపు




కొత్తపల్లి మండలం (దుద్యాల) -- పీర్ల చావిడిలో భక్తుల సందడి




కడపనగరం (వైఎస్సార్ కడప జిల్లా) -- మొహరం సందర్భంగా




మహానంది మండలం -- పెద్ద సరిగెత్తు, పీర్ల ఊరేగింపు

**నంద్యాల, పల్లె వెలుగు:**

నంద్యాల జిల్లా వ్యాప్తంగా మొహర్రం వేడుకలు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా ముగిశాయి. మండలాలు, పట్టణాల్లో పీర్ల చావిడిల వద్ద ప్రత్యేక ప్రార్థనలు, గుండాల వెలిగింపు, పెద్ద సరిగెత్తులు, పీర్ల ఊరేగింపులు, మాతం కార్యక్రమాలు, అన్నదానాలు నిర్వహించారు. హిందూ, ముస్లిం సోదరులు కులమతాలకు అతీతంగా పాల్గొని మొక్కులు చెల్లించుకోవడంతో సోదరభావం వెల్లివిరిసింది. వేలాది మంది భక్తులు తరలిరాగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించారు.

మహానంది మండలంలో తిమ్మాపురం, గాజులపల్లె, బసాపురం గ్రామాల్లో పెద్ద సరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐదు రోజులుగా పీర్ల చావిడిల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శుక్రవారం సాయంత్రం మంగళవాయిద్యాల నడుమ పీర్లను గ్రామ పురవీధుల్లో ఊరేగించి గ్రామ శివారులోని జలధికి తీసుకెళ్లారు. గుండాలు వెలిగించి భక్తులు జాగారం చేయగా, యువకులు గుండం చుట్టూ చిందులు వేస్తూ సందడి చేశారు.

పాణ్యం మండలంలోలిలి తొమ్మిది రోజులుగా కొనసాగిన మొహర్రం వేడుకలు ఘనంగా ముగిశాయి. పాణ్యం పట్టణంతో పాటు పలు గ్రామాల్లో పీర్ల ఉత్సవాలు నిర్వహించగా, యువకులు రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరాగా, సీఐ కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బండి ఆత్మకూరు మండలంలోలిలి ఈర్నపాడు, ఏ.కోడూరు, కడమల కాలువ, పార్నపల్లి తదితర గ్రామాల్లో పీర్ల ఊరేగింపులు కన్నుల పండువగా సాగాయి. బండి ఆత్మకూరులో ఇమాం ఖాసిం, హుస్సేన్ ఆలం, చందమామ పేర్లతో మొత్తం 15 పీర్లను ఊరేగించారు. నిప్పుల గుండం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం డీజేలు, డప్పులు, తప్పెట్ల నడుమ ఊరేగింపులు నిర్వహించారు. గత ఏడాది ఘటనలను దృష్టిలో ఉంచుకుని కడమల కాలువ గ్రామంలో ఎస్సై జగన్మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించడంతో వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి.

చాగలమర్రి మండల కేంద్రంలో చిన్న మకానంలో వెలసిన లాల్ స్వామి మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. లాల్ స్వామి పీర్లను గ్రామ చావిడి నుంచి గాంధీ సెంటర్ మీదుగా పెద్ద మకానం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తులు గంధం, పూలు, నగదు కానుకలు సమర్పించారు. లాల్ స్వామి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించగా, డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు రూరల్ సీఐ బి.వి. రమణ, ఎస్సై రాజారెడ్డి పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొత్తపల్లి మండలంలోని దుద్యాల గ్రామంలోలిలి మాసూం వలి స్వామి పీరు, పెద్ద పీరు, ఊసే నాలం పీర్లను గ్రామస్తులు వందలాది మంది భక్తుల మధ్య ఊరేగింపుగా ఏటికి తీసుకెళ్లారు. నాలుగు రోజులుగా పీర్ల చావిడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కాయలు, కర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

బనగానపల్లె పట్టణంలోలిలి మొహర్రం షహదత్ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. కర్బలా వీరమరణాన్ని స్మరిస్తూ షియా ముస్లింలు శోకగీతాలు ఆలపిస్తూ మాతం నిర్వహించారు. దొర కోట నుంచి ప్రారంభమైన ఆలంల (పీర్ల) ఊరేగింపు పట్టణ ప్రధాన వీధుల గుండా జుర్రేరు గట్టుకు చేరుకుంది. అనంతరం హసన్, హుస్సేన్, బీబీ ఫాతిమా పీర్ల చివరి ఘట్టం నిర్వహించి దట్టీలను భద్రపరిచారు. హైదరాబాద్ తర్వాత అత్యంత ఘనంగా జరిగే మాతం వేడుకలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అర్బన్, రూరల్ సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

జిల్లా వ్యాప్తంగా జరిగిన మొహర్రం వేడుకలు హిందూ--ముస్లిం సోదరభావానికి ప్రతీకగా నిలిచాయి. భక్తిశ్రద్ధలు, సంప్రదాయాలు, సామరస్యం కలగలిసిన ఈ వేడుకల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని మొక్కులు చెల్లించుకుని శాంతి, సౌభ్రాతృత్వానికి నిదర్శనంగా నిలిచారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com